

## ఎట్టకేలకు ముగించనున్న
# గేమ్‌చేంజర్

**రామ్‌చరణ్** 'గేమ్ చేంజర్' సినిమా షూటింగ్ మొదలై అప్పుడే రెండేళ్లు దాటింది. సజావుగా సాగాల్సిన ఈ సినిమా షూటింగ్‌కు 'ఇండియన్ ఫ్రాంచైజీ' రూపంలో అనుకోని అంతరాయాలు ఎదురయ్యాయి. ఈ ఒడిదుడుకుల ప్రయాణాన్ని ఎట్టకేలకు ముగించనున్నాడు 'గేమ్ చేంజర్'. మరో పదిరోజుల్లో రామ్‌చరణ్.. తన వెర్షన్‌కు సంబంధించిన షూటింగ్ అంతా పూర్తి చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందులో రామ్‌చరణ్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు పాత్రల్లోనూ రామ్‌చరణ్ యువకుడిగానే కనిపించనుండటం విశేషం. తండ్రి పాత్ర 70ల్లో సాగితే, కొడుకు పాత్ర సమకాలీనంగా సాగుతుందని తెలుస్తున్నది. తండ్రికి జోడీగా అంజలి, కొడుకుకి జోడీగా కైరా అద్వానీ నటిస్తున్న విషయం తెలిసిందే. సమకాలీన రాజకీయాలకు అద్దం పడుతూ, సమాజంలోని సమస్యలను ఎత్తిచూపుతూ శంకర్ మార్క్ చిత్రంగా ఈ సినిమా ఉండబోతున్నదని తెలుస్తున్నది. ఈ ఏడాది చివర్లో ఈసినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## తెలుగులో రీఎంట్రీకి రెడీ అవుతుందా?

2012లో 'నాఇష్టం' సినిమా తర్వాత నితేష్ దేశ్‌ముఖ్‌ని పెళ్లాడేసి, సినిమాలకు పుల్‌స్టాప్ పెట్టేసింది జెనీలియా. ఇద్దరు పిల్లలకు తల్లి అయినా కూడా జెనీలియాలోని ఆ అల్లరి హాసిని మాత్రం ఇంకా అలాగే ఉందని తన భర్తతో కలిసి ఆమె చేసే ఇన్‌స్టా రీల్స్ చెప్పకనే చెబుతుంటాయి. నితేష్, జెన్నీ కలిసి చేసే రీల్స్‌ని ఇష్టపడేవాళ్లు లక్షల్లో ఉంటారు. రీసెంట్‌గా భర్తతో కలిసి సొంతంగా చిత్ర నిర్మాణం కూడా మొదలుపెట్టిన జెనీలియా.. తన భర్త రితేష్‌తో కలిసి మరాఠీలో 'వేద్' అనే సినిమాలో నటించింది. తెలుగులో వచ్చిన 'మజిలీ'.. ఈ 'వేద్'కు మాతృక కావడం విశేషం. 'మజిలీ'లో సమంత పాత్రను 'వేద్'లో జెనీలియా చేసి, మరాఠీ ప్రేక్షకుల కితాబులందుకుంది. ఇక అసలు విషయానికొస్తే, మంచి పాత్ర దొరికితే తెలుగులోనూ నటించడానికి రెడీ అని స్టేట్‌మెంట్ ఇచ్చేసింది జెనీలియా. అయితే.. తను తెలుగులో హీరోయిన్‌గా చేస్తుందా? లేక ప్రత్యేక పాత్రలు చేస్తుందా? అనేది తెలియాల్సివుంది. నిజానికి జెనీలియా కంటే సీనియర్లయిన త్రిష, నయనతార నేటికీ హీరోయిన్లుగా చలామణీ అవుతున్నారు. వీరిలో నయన్ కూడా ఇద్దరు పిల్లల తల్లే. అలాంటప్పుడు ఇప్పటికీ అందంగానే ఉన్నా జెనీలియా హీరోయిన్‌గా ఎందుకు చేయకూడదని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు. చూద్దాం.. 'హాసిని' తెలుగు ఎంట్రీ ఎలా ఉంటుందో..



## కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది

'ఈ మధ్య వరుసగా సీరియస్ సినిమాలు చేస్తున్నానని అనిపించింది. మంచి ఎంటర్‌టైనర్స్ చేయమని అభిమానులు కోరేవారు. ఓ బ్యూటీఫుల్ పాయింట్‌తో 'మనమే' సినిమా చేశాం' అన్నారు శర్వానంద్. ఆయన కథానాయకుడిగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. బుధవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నా క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా ఉంటుంది. మనిషికి మనిషికి ఇవ్వగలిగే గొప్ప గిఫ్ట్ టైమ్. దర్శకుడు ఈ పాయింట్‌ను అద్భుతంగా ఆవిష్కరించాడు. చివరి 40 నిమిషాలు ప్రేక్షకులు కొత్త ప్రపంచంలోకి వెళతారు. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలు కలబోసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. నా ఇరవైఏళ్ల సినీ ప్రయాణంలో 35 సినిమా చేశాను. ఈ జర్నీ ఎంతో సంతృప్తినిచ్చింది' అన్నారు. ఈ సినిమాలో శర్వానంద్ అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచాడని, సక్సెస్‌మీట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ సినిమా తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, శర్వానంద్ తన నటనతో మరో స్థాయికి తీసుకెళ్లాడని దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## మా నమ్మకం నిజమైంది

'బెదరులంక, భజే వాయువేగం.. ఏడాదిలో రెండు విజయాలు అందుకున్నా. ఇప్పుడు నా విషయంలో ప్రేక్షకుల దృష్టి కోణం మారింది. కచ్చితంగా హిట్ సినిమా అవుతుందని నమ్మి చేశాం. మా అందరి నమ్మకాన్ని నిజం చేసింది 'భజే వాయువేగం' అంటున్నారు హీరో కార్తికేయ. ఆయన కథాయకుడిగా రూపొందిన చిత్రం 'భజేవాయువేగం'. ప్రశాంత్‌రెడ్డి దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడారు. సినిమాకు పనిచేసిన అందరికీ దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో నటుడు రాహల్ టైసన్. ఎడిటర్ సత్య.జి, నేపథ్య సంగీతం అందించిన కపిల్‌కుమార్, మాటలు రాసిన మధు శ్రీనివాస్ కూడా మట్లాడారు.



## సామాన్యుడి ప్రతీకారం

విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటిస్తున్న 50వ చిత్రం 'మహారాజ'. నితిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల హక్కులను ఎన్‌వీఆర్ సినిమా దక్కించుకుంది. భారీ స్థాయిలో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఓ సాధారణ వ్యక్తి తనకు జరిగిన అన్యాయంపై ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడన్నదే చిత్ర కథాంశమని, విజయ్ సేతుపతి పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తాడని చిత్ర బృందం పేర్కొంది. మమతా మోహన్ దాస్, నటరాజ్, భారతీరాజా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి, రచన-దర్శకత్వం: నితిలన్ స్వామినాథన్.

## ఎమోషనల్ ఇన్వెస్టిగేటివ్ డ్రామా సత్యభామ

'బుధవారం 'సత్యభామ' ప్రీమియర్ వేశాం. అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదల చేస్తున్నాం. పోలీస్ స్టోరీస్ గతంలో ఎన్నో వచ్చాయి. అయితే ఎమోషనల్‌గా 'సత్యభామ' మాత్రం స్పెషల్. నేటి ఆడియన్స్‌కు నచ్చేలా ఫ్రెష్ స్టోరీ టెల్లింగ్‌తో 'సత్యభామ' ఉండబోతున్నది.' అన్నారు చిత్ర స్క్రీన్‌ప్లే రైటర్ శశికిరణ్ తిక్క. ఆయన సమర్పకుడిగా కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రతో రూపొందిన చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వంలో శ్రీనివాసరావు తక్కలపల్లి, బాబీ తిక్క నిర్మించిన ఈ సినిమా నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా స్క్రీన్‌ప్లే రైటర్ శశికిరణ్ తిక్క విలేకరులతో ముచ్చటించారు. 'యూకేలోని నా మిత్రులు రమేశ్, ప్రశాంత్ చెప్పిన కథతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. ఆ పాయింట్ నచ్చి, నేను, దర్శకుడు సుమన్ చిక్కాల కలిసి ఈ కథ తయారు చేశాం. అప్పుడు 'మేజర్' షూటింగ్ జరుగుతున్నది.



ఆ సినిమా పూర్తయ్యాక, ఈ సినిమాను సెట్స్‌కి ఎక్కించాలనుకున్నాం. కాజల్‌కి ముందు కథ వినిపించాం. ఆమె విపరీతంగా నచ్చింది. అలా ప్రాజెక్ట్ స్టార్టయ్యింది' అని తెలిపారు శశికిరణ్ తిక్క. స్వతహాగా దర్శకుడ్నయిన తాను, ఈ సినిమాతో నిర్మాతగా కూడా అనుభవం పొందగలిగానని, చిత్ర సమర్పకుడిగా సినిమా మేకింగ్‌లో కూడా మరిన్ని కొత్త విషయాలు తెలుసుకున్నానని శశికిరణ్ తెలిపారు. కాజల్ గురించి చెబుతూ ' కాజల్ అలిసిపోవడం నేను చూడలేదు. షూటింగ్ టైమ్‌లో తన ఎనర్జీ మా అందరిలో ఉత్సాహం నింపేది. యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా చేసింది.' అని తెలిపారు. ఇది రెగ్యులర్ ఇన్విస్టిగేటివ్ థ్రిల్లర్ కాదని, ఎమోషన్స్‌తో కూడుకున్న ఇన్విస్టిగేటివ్ డ్రామా అనీ శశికిరణ్ తిక్కా చెప్పారు.

## ఓ పోలీస్ అధికారి జీవితం ఆధారంగా

'రక్షణ' ఓ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. బాధితులకై పోరాటం.. వారిని రక్షించే ప్రయత్నం నేపథ్యంలో కథ సాగుతుంది కాబట్టి సినిమాకు 'రక్షణ' అనే పేరు పెట్టాం. అసలు ముందు తెలంగాణ పోలీసు వాహనాల పేరైన 'రక్షక్'ని టైటిల్‌గా అనుకున్నాం.. కుదర్లేదు. చివరకు రక్షణను ఫైనల్ చేశాం. ఇది పూర్తి రియలిస్టిక్ అప్రోచ్ ఉన్న సినిమా' అని ఈ చిత్ర దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకోర్ అన్నారు. పాయల్ రాజ్‌పుత్ మెయిన్ లీడ్‌గా నటించిన 'రక్షణ' సినిమా నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రణదీప్ ఠాకోర్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో పాయల్ అద్భుతంగా నటించింది. అగ్రిమెంట్ ప్రకారం ఆమెకు మేం ఇంకా 6 లక్షలు దాకా ఇవ్వాలి. ఆమె ప్రమోషన్స్‌కి రాకపోయినా ఆమె బ్యాలెన్స్ అమౌంట్ ఆమెకు ఇచ్చేస్తాం. ఎందుకంటే నాకు ఈ కథపై నమ్మకం ఉంది. మంచి పంపిణీదారులు దొరికారు. తప్పకుండా విజయం సాధిస్తుందని నా నమ్మకం' అని చెప్పారు ప్రణదీప్ ఠాకోర్. పాయల్ రాజ్‌పుత్ ఇమేజ్‌ని పూర్తిగా మార్చే సినిమా ఇదని, ఓ పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన సంఘటనను స్ఫూర్తిగా తీసుకుని ఈ కల్పిత కథ రాశానని ప్రణదీప్ ఠాకోర్ చెప్పారు.





## రామాయణాన్ని సినిమాగా తీయొద్దు!

భారతీయ పౌరాణిక ఇతిహాసం రామాయణాన్ని నేటి తరంలో సినిమాగా తీయకపోవడమే మంచిదని సూచించారు నటి దీపికా చిఖ్లియా. రామానంద్ సాగర్ దర్శకత్వం వహించిన అలనాటి రామాయణ ధారావాహికలో సీత పాత్ర ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపుని సంపాదించుకుంది దీపికా చిఖ్లియా. 'ఆదిపురుష్' తర్వాత రామాయణగాథ మరోమారు భారతీయ వెండితెరపై దృశ్యమానం కాబోతున్న విషయం తెలిసిందే. సాయిపల్లవి, రణబీర్‌కపూర్ సీతారాముల పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు నితీష్ తివారి రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రామాయణ నేపథ్య సినిమాలపై దీపికా చిఖ్లియా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. సమకాలీన పరిస్థితుల్లో రామాయణ ఇతిహాసాన్ని సినిమాలుగా తీయొద్దని, కొత్తదనం పేరుతో రామాయణ ప్రాశస్త్యాన్ని, పవిత్రతను దెబ్బతీస్తున్నారని ఆమె అభిప్రాయపడింది. ''ఆదిపురుష్' సినిమాలో రామాయణం తాలూకు ప్రామాణికత మిస్ అయింది. సీతా దేవి పాత్రను గులాబీ రంగు చీరలో, రావణాసురుడిని విభిన్నమైన ఆహార్యంలో చూపించడం ఏమాత్రం బాగోలేదు. సృజనాత్మకంగా ఏదో కొత్తగా చూపించాలనే తాపత్రయంలో రామాయణం తాలూకు గొప్పతనాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. భారతీయ ఇతిహాసాల జోలికిపోకుండా యువతలో స్ఫూర్తినింపే స్వాతంత్ర్య సమరయోధులు చరిత్రలను సినిమాలుగా తీస్తే బాగుంటుంది' అని దీపికా చిఖ్లియా సలహా ఇచ్చింది.




